WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramteugudaily@gmail.com

# నవతరం

హైదరాబాద్ సంపుటి : 9 సంచిక : 217 బుధవారం, ఆగస్టు 05, 2026, పేజీలు - 4 వెల: 5/-

సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు

## టీ-ఫైబర్ ఇంటర్నెట్:



**హైదరాబాద్:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కా ర్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించా లని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివా లయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు.
ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ (ఎ-రాజౌచీ) నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు రేవంత్ రెడ్డి

# విదేశీ పర్యటనలు


- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం
- మంగళవారం రాత్రి దిల్లీకి వెళ్లనున్న ముఖ్యమంత్రి



రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది. రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అం తర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొ ందించడం, క్రీడారంగాన్ని మరింత బలో పేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టను న్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయను న్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

పేదరికం లేని సమాజం

## చూడాలనేది నా కల



**అమరావతి, ఆగస్టు 4:** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా: ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం పేర్కొన్నారు. 'సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం.

కాంగ్రెస్ అబద్ధాలకు 'కాళేశ్వరం'

## నీళ్లే సమాధానం




**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాలకు క్షేత్రస్థాయిలోని నీళ్లే సరైన సమాధానం చెబుతున్నాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు (కేటీఆర్) పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట తన ప్రాముఖ్యతను మరొకసారి చాటిచెబుతోందని ఆయన సోమవారం సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ 'ఎ' (ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు. "రెండు లక్షల ఎకరాలకు భరోసా!" కాళేశ్వరం ప్రాజెక్ట ద్వారా శ్రీరాంసాగర్ () వరద కాలువను 'రివర్స్ పంపింగ్' పద్ధతిలో పునరుజ్జీవింపజేస్తున్న దృశ్యాలను కేటీఆర్ పంచుకున్నారు. వరద కాలువ పరిధిలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుండి నీటిని నిరంతరాయంగా ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. ఈ ఎత్తిపోతల ద్వారా సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, ఇది తెలంగాణ రైతన్నల పంటలకు కొండంత భరోసానిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. "రైతులకు నిజా నిజాలు తెలుసు' 'కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని అబద్ధాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కేటీఆర్ అన్నారు. పచ్చని తమ పొలాల్లో నేరుగా ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలను కళ్లారా చూస్తున్న తెలంగాణ రైతాంగానికి ఏది నిజమో, ఏది అబద్ధమో స్పష్టంగా తెలుసని ఆయన స్పష్టం చేశారు.

## డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలకు సన్నాహాలు

- సీఎంఆర్‌పై మంత్రి ఉత్తమ్ ఫోకస్



**హైదరాబాద్, ఆగస్టు 4:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మెటాపై కేసు నమోదు చేసిన ఆ డీసీపీని..

## రేవంత్‌రెడ్డి బదిలీ చేశారు



**హైదరాబాద్, ఆగస్టు 4 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యా నించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. (మంగళవారం) కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాం గం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించా రని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా.

నీట్ ప్రవేశాలకు

## సర్వం సిద్ధం


- 13 నుంచి రాష్ట్ర స్థాయి సీట్లకు ?

### కౌన్సిలింగ్ ప్రక్రియ

**న్యూ ఢిల్లీ :** వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యా లయం కీలక అప్‌డేట్ ఇచ్చింది. నీట్ ప్రవే శాల కౌన్సెలింగ్‌కు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ వైస్-ఛాన్స లర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రకటించారు. సాంకే తిక కారణాల వల్ల ఆలిండియా కోటా కౌన్సె లింగ్ ఒకరోజు ఆలస్యంగా ప్రారంభం కాను ందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బ ందులు కలగకుండా కట్టుదిట్ట మైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించా రు. ఆలిండి యా కోటా సీట్ల భర్తీకి సంబంధిం చిన కౌన్సెలింగ్ ఇవాల్టి నుంచే ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, కొన్ని సాంకేతిక కారణాల రీత్యా అది సాధ్యపడలేదు. దీంతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇక రాష్ట్ర కోటా సీట్లకు సంబ ంధించిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 13వ తేదీ ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు.

నటి త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యలు

## మద్రాస్ హైకోర్టు బెయిల్ మంజూరు




**మద్రాస్ :** సినీ నటి త్రిషపై అసభ్య వ్యాఖ్యల కేసులో తమిళ నాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిం ది. పిటిషనర్‌ను రిమాండ్‌కు తరలించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అడ్వకేట్ జనరల్ విజయ నారాయన్ పేర్కొనడంతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ తర్వాత స్టేషన్ బెయిల్‌పై ఉదయనిధిని విడిచిపెడతామని కోర్టుకు తెలిపారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు పోలీసుల విచారణకు సహకరించాలన్న షరతుతో ఉదయనిధికి బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు తంజావూరు పోలీసు లు ఉదయనిధిని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. ఈ క్రమంలో డీఎంకే కార్యకర్తలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పలువురు డీఎంకే కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను తమిళనాడు ప్రతిపక్షనేత ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తాను అనని మాటలను అన్నట్లు చూపించడానికి 'కట్, కాపీ, పేస్ట్' ఎడిటింగ్ పద్ధతులను ఉపయోగించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని వ్యాఖ్యానించారు. ఇటువంటి బెదిరింపులకు తాను భయపడనని, ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. అలాగే, తన అరెస్టుపై పోలీసుల చర్యను ఒక "కామెడీ"గా అభివర్ణించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అనంతరం ఉదయనిధి మీడియాతో మాట్లాడారు.

# శుభకార్యాలకు శూన్యం! ఆషాఢంలో విరామం... శ్రావణంలో సందడి

**- ఆషాఢంలో శుభకార్యాలకు బ్రేక్, రైతులకు సాగుపనుల సీజన్, గోరింటాకుకు పెరుగుతున్న డిమాండ్, శ్రావణంలో వేలాది వివాహ ముహూర్తాలు**





**కోటబొమ్మాళి:** తెలుగు నెలల్లో ఆషాఢ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆషాఢం రాగానే "శుభకార్యాలకు శూన్యం" అనే మాట సహజంగా వినిపిస్తుంది. నిజంగానే ఈ నెలలో వివాహాలు, గృహప్రవేశాలు, ఉపనయనాలు, నూతన వ్యాపార ప్రారంభాలు వంటి శుభకార్యాలకు విరామం ఇస్తారు. కోటబొమ్మాళి, పలాస, మందస, టెక్కలి ప్రాంతాల్లోనూ ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. పురాణాల ప్రకారం ఆషాఢంలో దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సూర్యుడు కర్కాటక రాశిలోకి ప్రవేశించే ఈ కాలాన్ని దేవతలకు రాత్రి సమయంగా భావిస్తారు. అందుకే ఈ 6 నెలల కాలంలో పెద్ద శుభకార్యాలు చేయరు. ఇక వ్యవసాయ కోణం నుంచి చూస్తే ఆషాఢంలో కుండపోత వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉంటుంది. రైతులు పొలం పనులు, వరి నాట్లు, ఎరువులు వేయడంలో బిజీగా ఉంటారు. అందుకే కుటుంబాలకు శుభకార్యాలకు సమయం ఉండదు. కోటబొమ్మాళి మండల పురోహితుడు శ్రీనివాస శర్మ మాట్లాడుతూ, "ఆషాఢంలో ప్రకృతి అల్లకల్లోలంగా ఉంటుంది. వర్షాలు, తుఫానులు, రోగాలు వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే మన పెద్దలు శుభకార్యాలు వాయిదా వేయమని చెప్పారు. ఇది సైన్స్, సంప్రదాయం కలిసిన నిర్ణయం" అని తెలిపారు.

ఆషాఢం శూన్య మాసమైనా ఎన్నో విశిష్టతలున్నాయి. గురు పూర్ణిమ రోజున గురువులను పూజిస్తారు. వేదవ్యాసుడి జయంతి కూడా ఇదే రోజు. ఉత్తరాంధ్రలో ఆషాఢంలో ప్రతి ఆదివారం బోనాలు జరుపుతారు. ఉత్తరాంధ్రలో రైతులు ఈ నెలలోనే వరి నారుమడులు వేసి, నాట్లు ప్రారంభిస్తారు. "ఆషాఢం వస్తే సాగుకు శ్రీకారం" అంటారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సుసరాపు చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ "ఆషాఢం అంటే భక్తికి, సాధనకు అంకురార్పణ చేసే నెల. దక్షిణాయనం ప్రారంభమయ్యే ఈ మాసంలో మనం అంతర్ముఖులమై దైవచింతన చేయాలి. వ్యవసాయానికి, ఆధ్యాత్మికతకు రెండింటికీ బీజం వేసే పవిత్ర కాలం ఇది" అని అన్నారు. ఆయన ఇంకా "ఆషాఢ మాసంలో మనం శుభకార్యాలు ఆపి ఆత్మశుద్ధి చేసుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ కాలంలో ప్రకృతి రజోగుణం ఎక్కువగా ఉంటుంది. అందుకే దాన్ని నియంత్రించి సాత్వికంగా ఉండేందుకు ఉపవాస, జప, దానాలు చేయాలి" అని తెలిపారు. ఆషాఢ మాస గొప్పదనాన్ని వివరిస్తూ ఆయన ఒక సంస్కృత శ్లోకాన్ని ఉదహరించారు. శ్లోకం: ఆషాఢస్య ప్రారంభే దక్షిణా యన మారభేత్ ధర్మకార్యాణి సర్వాణి త్యక్త్వా మౌనం సమాశ్ర యేతఅర్థం: "ఆషాఢ మాసం ప్రారంభంతోనే దక్షిణాయనం మొదలవుతుంది. ఈ కాలంలో అన్ని ధర్మకార్యాలను కొంతకాలం పక్కనపెట్టి, మౌనంగా, సాత్వికంగా ఉండి ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని వివరించారు. "ఇది విశ్రాంతి మాసం కాదు. మనలోపలి దైవాన్ని దర్శించే సాధన మాసం. ఈ నెలలో చేసే చిన్న జపం కూడా సంవత్సరమంతా పుణ్యాన్ని ఇస్తుంది" అని సూచించారు. ఆషాఢంలో విష్ణు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. కోటబొమ్మాళి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం తిరుప్పావై, తిరువాయ్మొళి పారాయణం చేస్తున్నారు. మహిళలు ఇంట్లో గోదాదేవి వ్రతాలు, లక్ష్మీ పూజలు చేస్తున్నారు. ఈ నెలంతా భక్తి, ఉపవాసాలు, దానాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో మహిళల చేతులకు గోరింటాకు తప్పనిసరి. దీనికి సైన్స్, సంస్కృతి రెండూ ఉన్నాయి. గోరింటాకు గురించి ఆయుర్వేదంలో మెహందీ శీతలా కేశ్యా కుష్ఠఘ్నీ వ్రణరోపిణీ అనే శ్లోకం ఉంది. అర్థం: గోరింటాకు శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది, చర్మరోగాలు, గాయాలను నయం చేస్తుంది. మరో శ్లోకం హస్తే మెహందీం చరణే చ లాక్షాం వదనే తాంబూలం స్తనే చ కుంకుమం. అర్థం: చేతులకు గోరింట, కాళ్లకు లక్క, నోటికి తాంబూలం, కుంకుమ ధరించడం స్త్రీల అలంకారం. పురాణాల్లోనూ గోరింటాకుకు చోటు ఉంది. మహాభారతంలో ద్రౌపది అజ్ఞాతవాసంలో సైరంధ్రిగా ఉన్నప్పుడు రాణులకు గోరింటాకు పెట్టేదని ఉంది. అందం, సౌభాగ్యానికి చిహ్నంగా భావించేవారు. రామాయణంలో సీతమ్మ లంకలో ఉన్నప్పుడు త్రిజట ఆమెకు ధైర్యం చెప్పడానికి గోరింటాకు కథలు చెప్పిందని కొన్ని ప్రాంతీయ గాథలున్నాయి. శ్రీకృష్ణ లీల్లో గోపికలు కృష్ణుడి కోసం చేతులకు గోరింట పెట్టుకునేవారని భాగవతంలో ప్రస్తావన ఉంది. రాధాకృష్ణుల ప్రేమకు గోరింట సంకేతం. ఆయుర్వేదం ప్రకారం గోరింటాకు ఒంట్లోని వేడిని తగ్గిస్తుంది. అరచేతులకు పెట్టుకుంటే నిద్ర బాగా పడుతుంది, తలనొప్పి తగ్గుతుంది. ఫంగస్, చర్మ సమస్యలను నివారిస్తుంది. అందుకే వర్షాకాలంలో ఎక్కువగా పెట్టుకుంటారు. కోటబొమ్మాలిలోని గోరింటాకు వ్యాపారి లక్ష్మి మాట్లాడుతూ, "ఆషాఢం నుంచే అమ్మాయిలు గోరింట కోసం అడుగుతున్నారు. శ్రావణంలో అయితే రోజుకు 200 మంది వరకు వస్తారు. డిజైన్ గోరింటాకు, కోన్ గోరింటకు డిమాండ్ ఎక్కువ" అని చెప్పారు. ఆషాఢం తరువాత శ్రావణ మాసం వస్తుంది. ఈ నెల అంతా శుభకార్యాలకు అనుకూలం. కోటబొమ్మాలి, శ్రీకాకుళం జిల్లాలో శ్రావణంలో వేలాది వివాహ ముహూర్తాలు ఉంటాయి. జ్యువెలరీ షాపులు, చీరల దుకాణాలు, ఈవెంట్ మేనేజర్లు ఇప్పటి నుంచే బుకింగ్‌లు తీసుకుంటున్నారు. వడ్రంగులు, పూల వ్యాపారులు, వంటవాళ్లు అందరికీ ఇదే బిజీ సీజన్. నాగపంచమి, వరలక్ష్మి వ్రతం, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి – అన్నీ ఈ నెలలోనే వస్తాయి. కోటబొమ్మాలికి చెందిన గృహిణి సుజాత మాట్లాడుతూ, "మా అమ్మాయి పెళ్లి శ్రావణంలోనే పెట్టాం. ఆషాఢంలో ఖాళీగా ఉంటాం కాబట్టి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. గోరింట, పూలు, పట్టుచీరలు కొంటున్నాం" అన్నారు. ఇక రైతులు మాత్రం ఆషాఢాన్ని "పని మాసం" అంటున్నారు. మందస రైతు రామారావు, "వర్షం పడితేనే మా పండుగ. నాట్లు వేసుకుంటేనే సంవత్సరం గడిచేది. శుభకార్యాలు తర్వాత" అని నవ్వుతూ చెప్పారు. మొత్తంగా ఆషాఢం అంటే విశ్రాంతి, దైవచింతన, వ్యవసాయం చేసే నెల. శ్రావణం అంటే వేడుకలు, సంబరాలు, బంధుత్వాల సందడి చేసే నెల. ప్రకృతి చక్రానికి అనుగుణంగా మన సంప్రదాయాలు ఏర్పడ్డాయి. అందుకే "ఆషాఢంలో ఆగి, శ్రావణంలో సందడి చేద్దాం" అనేది పెద్దల మాట.

# "విశాఖ కొండలు కరిగిపోతున్నాయి.. సహజ వనరుల దోపిడీ ఆపాలి"

**- పర్యావరణ విధ్వంసంపై సీఎంకు 'సిరిగిరి' లేఖ**
**- గణాంకాలతో విశాఖ విధ్వంసం వివరాలు వెల్లడి**



**కోటబొమ్మాళి:** విశాఖపట్నంలో ఇటీవల కాలంలో యథేచ్ఛగా కొనసాగుతున్న కొండలు, సహజ వనరుల దోపిడీ, దాని వల్ల పర్యావరణానికి కలుగుతున్న విఘాతాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణ చర్యలు చేపట్టాలని నవచైతన్య యువజన సేవా సమితి వ్యవస్థాపక చైర్మన్ సిరిగిరి వరదరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి బహిరంగ లేఖ రాశారు. గత 3 సంవత్సరాల్లో విశాఖ జిల్లాలో 1200 ఎకరాలకు పైగా కొండ భూములు బుల్డోజర్లతో చదును చేయబడ్డాయని, దీనివల్ల సుమారు 4.5 లక్షల చెట్లు నరికివేతకు గురయ్యాయని గణాంకాలతో లేఖలో పేర్కొన్నారు. విశాఖ నగర పరిధిలోని ఎర్రమట్టిదిబ్బ, సింహాచలం, కైలాసగిరి, యారాడ కొండల పరిసరాల్లో అక్రమ మట్టి, రాయి తవ్వకాలు రోజుకు 500 లారీలకు పైగా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పారిశ్రామిక సంస్థల పేరుతో కొండలను తవ్వి సమతలం చేస్తున్నారని, దీనివల్ల సహజ జలవనరులు, జీవవైవిధ్యం పూర్తిగా దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దోపిడీ కారణంగా విశాఖలో భూగర్భ జలమట్టం గత 5 ఏళ్లలో సగటున 15 అడుగుల మేర పడిపోయిందని, వాయు కాలుష్యం 40 శాతం పెరిగిందని తెలిపారు. పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం విశాఖలో ్రావీ 2.5 స్థాయి 85 స్త్ర/ఎట కు చేరిందని, ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కంటే 3 రెట్లు ఎక్కువని పేర్కొన్నారు. తీర ప్రాంత కోత కారణంగా యారాడ, భీమిలి తీరాల్లో సుమారు 3 కిలోమీటర్ల మేర బీచ్ కోతకు గురైందని, దీనివల్ల 2000 కుటుంబాలకు పైగా మత్స్యకారుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని వివరించారు.

కొండలు తవ్వకం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండే సహజ వ్యవస్థ దెబ్బతినడంతో గత ఏడాది విశాఖలో వరదల తీవ్రత 30 శాతం పెరిగిందని, 15 గ్రామాలు జలమయమయ్యాయని గుర్తు చేశారు. పచ్చదనం తగ్గడంతో వేసవిలో నగర ఉష్ణోగ్రతలు సగటున 2 డిగ్రీల సెల్సియస్ పెరిగాయని, దీనివల్ల హీట్ వేవ్ ప్రభావం సామాన్య ప్రజలపై పడుతోందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కంటే పాలకపక్షం ప్రతిపక్షాలపై విమర్శలకు, అక్రమ అరెస్టులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తోందని, వ్యవస్థలు తమ బాధ్యతలను విస్మరించాయని ఆరోపించారు. శాంతి భద్రతలు క్షీణించడంతో పాటు సచివాలయ వ్యవస్థ కూడా క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో లేదని, పర్యావరణ ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో అక్రమ మైనింగ్, కొండల తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని, నరికివేసిన ప్రతి చెట్టుకు 10 చెట్లు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. విశాఖ గ్రీన్ బెల్ట్ ప్రాంతాలను కాపాడేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన పర్యావరణ పరిరక్షణ హామీలను వెంటనే అమలు చేయాలని, విశాఖను సుందర, సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

# ఐవీఎఫ్ ఫెర్టిలిటీ చికిత్సలు చేయించుకుంటున్నారా - ఏఆర్‌టీ చట్టం ఏం చెబుతుందో తెలుసా




**హైదరాబాద్ :** తెలంగాణలో మొత్తం సంతానోత్పత్తి రేటు దాదాపు 1.5 పిల్లలకు పడిపోయింది. దీనిపై నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ, హైదరాబాద్ చర్చ కార్యక్రమం ఏర్పాటుచేసింది. ఇది పారదర్శకమైన, నైతిక ఫెర్టిలిటీ సంరక్షణ పెరుగుతున్న అవసరాన్ని ఎత్తి చూపింది. ఫెర్టిలిటీ చికిత్సలు పొందే ముందు రోగులు ఏఆర్?టీ చట్టం (అసిస్టెడ్? రిప్రొడక్టివ్? టెక్నాలజీ రెగ్యులేషన్? యాక్ట్? 2021) గురించి తెలుసుకోవడంపై అవగాహన కల్పించింది. అసిస్టెడ్? రిప్రొక్టివ్? టెక్నాలజీ (ఏఆర్?టీ)లో భారతదేశం ప్రజా విశ్వాసాన్ని ఎలా బలోపేతం చేయగలదో చర్చించడానికి అనేక ంగాల నిపుణులు పాల్గొన్నారు. 1.5కి పడిపోయిన సంతానోత్పత్తి రేటు : బిల్డింగ్ ట్రస్ట్, ఎథిక్స్ అండ్ అవేర్‌నెస్ ఇన్ అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) అనే ప్యానెల్ చర్చకు నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ క్లినికల్ డైరెక్టర్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్? హిమ దీప్తి మోడరేటర్‌గా వ్యవహరించారు. ప్యానెలిస్టులుగా సీనియర్ హెల్త్ జర్నలిస్ట్ కనిజా గరారీ, సీనియర్? మెడికో లీగల్? కన్సల్టెంట్? డాక్టర్? గీతేంద్ర శర్మ, నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ సీఈవో శోభిత్? అగర్వాల్? ఉన్నారు. దాదాపు 6 గంటలలో ఒకరిని సంతానలేమి సమస్య ప్రభావితం చేస్తుందని, అదే సమయంలో తెలంగాణ మొత్తం సంతానోత్పత్తి రేటు దాదాపు 1.5 కి పడిపోయిందని, ఇది ఫెర్టిలిటీని ప్రజారోగ్య సంభాషణలో కీలకమైన భాగంగా మారుస్తుందని ప్యానెలిస్టులు పేర్కొన్నారు. రోగులు రిజిస్టర్డ్? ఫెర్టిలిటీ క్లినిక్?లను గుర్తించడానికి, ఏఆర్టీ చట్టం కింద తమ హక్కులను అర్థం చేసుకోవడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని, తద్వారా వారు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోగలరని స్పష్టం చేశారు. చట్టం కల్పించే రక్షణపై అవగాహన : ఐవీఎఫ్? రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్? సిటీ ఏసీపీ మురళి కృష్ణ తెలిపారు. సాంకేతికత ఎంత వేగంగా పురోగమిస్తున్నప్పటికీ కొంతమంది అక్రమ మార్గాలను అనుసరించే వ్యక్తుల వల్ల దుర్వినియోగాలు కూడా జరుగుతున్నాయి. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై చర్యలు తీసుకుని, నేరస్థులను శిక్షించేందుకు అసిస్టెడ్? రీప్రొడక్టివ్? టెక్నాలజీ చట్టం 2021 ఒక బలమైన చట్టపరమైన వ్యవస్థను అందిస్తోంది. నోవా ఐవీఎఫ్?తో పాటు దేశంలోని అన్నిఫెర్టిలిటీ సంస్థలు ఈ చట్టానికి సంబంధించిన వివరాలను తమ కేంద్రాల్లో స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు, రోగులకు వారి హక్కులు, చట్టం కల్పించే రక్షణలపై అవగాహన కల్పించాలని ఏసీపీ మురళి కృష్ణ కోరారు. "ఏఆర్?టీ చట్టం ఫెర్టిలిటీ సంరక్షణలో ఎంతో అవసరమైన నిబంధనలను తీసుకువచ్చింది. చట్టం అమలులో ఉన్నప్పటికీ రోగులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. నైతిక ఫెర్టిలిటీ సంరక్షణ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. చికిత్స నిర్ణయాలు తీసుకునే ముందు పారదర్శకమైన సమాచారాన్ని పొందేందుకు వీలుండాలి. నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ వద్ద అసిస్టెడ్? రిప్రొడక్షన్?లో ప్రజా విశ్వాసాన్ని పెంపొందించడానికి విధాన నిర్ణేతలు, నియంత్రకులు, చట్ట అమలు అధికారులు, మీడియా మధ్య సమగ్ర సహకారం అవసరమని గట్టిగా నమ్ముతున్నాం. నైతిక ఫెర్టిలిటీ సంరక్షణ ప్రదాతలుగా కేవలం ఫెర్టిలిటీ చికిత్సలను అందించడమే కాకుండా రోగులకు సాధికారత కల్పించడం మా బాధ్యత" – శోభిత్? అగర్వాల్?, నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ సీఈఓ

ఏఆర్?టీ చట్టానికి అనుగుణంగా క్లినిక్?లు : నోవా ఐవీఎఫ్? ఫెర్టిలిటీ నిర్వహించిన ప్యానెల్? చర్చ భారతదేశ అసిస్టెడ్? రిప్రొడక్టివ్? టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కేవలం నియంత్రణ పాటించడం కంటే ఎక్కువ అవసరమని తేల్చింది. ప్రత్యేకంగా తగ్గుతున్న జననాల రేటును ఎదుర్కొంటున్న తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ అనేది ప్రజారోగ్య ప్రాధాన్యతగా మారుతున్నందుకు ఏఆర్?టీ చట్టానికి అనుగుణంగా ఉండే క్లినిక్?లను ఎలా ఎంచుకోవాలో ప్రతి జంటకు అవగాహన ఉండేలా పారదర్శక, నైతిక, నాణ్యమైన ఫెర్టిలిటీ సంరక్షణను పొందేలా చూడటం అందరి బాధ్యతని వైద్యులు చెబుతున్నారు. "నైతిక జర్నలిస్టులుగా, సంతానలేమిపై శాస్త్రీయ వాస్తవాలను, తప్పుడు సమాచారాన్ని వేరు చేయడం మా బాధ్యత. సంతానలేమితో ముడిపడి ఉన్న కళంకాన్ని తగ్గించడం, తనిఖీ చేయని సమాచారంపై ఆధారపడకుండా జంటలను నిరుత్సాహపరచడం కూడా మా ముఖ్య ఉద్దేశ్యం"– కనిజా గరారీ,

# నిద్రావస్థలో కొంపల్లి టౌన్ ప్లానింగ్ యంత్రాంగం

- కుత్బుల్లాపూర్ జోన్, కొంపల్లి సర్కిల్ లో అడ్డగోలు అక్రమ నిర్మాణాలు
- జీరో అనుమతులతో నిర్మాణాలు, నిద్రావస్థలో సర్కిల్ అధికారులు
- నోటీసులతో సరిపెడుతూ.. అందినకాడికి దండుకుంటున్న టౌన్ ప్లానింగ్!
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం.. కేసులు నమోదు చేయాలంటున్న ప్రజలు

## అక్రమ నిర్మాణంపై చర్యలేవి..?


- సుభాష్ నగర్ లోని అక్రమనిర్మాణాలకు బాధ్యులెవరు..?
- అప్పట్లో వదిలేశారు.. ఇప్పుడు కూడానా..?
- రేకుల ఇండ్లు పోయి.. భవంతులు వెలుస్తున్నాయి
- పూర్తి స్థాయిలో బఫర్ జోన్ మాయం
- వార్తలు రాసినా పట్టించుకోరా..?
- కుత్బుల్లాపూర్ ఇరిగేషన్ అండ్ మున్సిపల్ అధికారులు మౌనం వీడేనా..?

నిర్మాణదారుడి బరితెగింపు

SUBHASH NAGAR NALA



**కొంపల్లి / కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్ లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ షెడ్లు, బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు కొనసాగుతున్నా తమకెలాంటి సంబంధం లేదన్నట్టు స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే తమ విధుల కంటే.. అక్రమ సంపాదనే ముఖ్యమన్నట్టుంది. మై క్యూర్ యాప్ ద్వారా ఆన్లైన్ ఫిర్యాదులు వచ్చినా.. కేవలం నోటీసుల పేరిట ఫిర్యాదులు క్లోజ్ చేస్తున్నారే తప్ప, పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటున్నారు ఫిర్యాదుదారులు. ఒకవేళ అక్రమ సంపాదన మీద ధ్యాస లేకుంటే విధి నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా, చట్టపరమైన చర్యలు తీసుకుంటారు కానీ ఇలా కాలాయాపన చేయరంటున్నారు స్థానిక ప్రజలు. అందుకు పదుల సంఖ్యలో ఉదాహరణాలున్నాయి. బహదూర్ పల్లి, దూలపల్లి, సుభాష్ నగర్, ఫాక్స్ సాగర్ బఫర్ జోన్, ఫాక్స్ సాగర్ నాలా ఆక్రమణ.. ఇలా చెప్పుకుంటూ పోతే, బస్తీకొక అక్రమ నిర్మాణం కంటపడుతుంది. ప్రధానంగా, కొంపల్లి సర్కిల్ లోని సుభాష్ నగర్ ఫాక్స్ సాగర్ నాలా ఆక్రమణ -- బహుళ అంతస్తుల భవన నిర్మాణం, ఫాక్స్ సాగర్ చెరువు కట్ట కింది భాగంలో కమర్షియల్ షెడ్డు నిర్మాణ పనులు ఎలాంటి అనుమతులు కొనసాగుతున్నా.. కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు కొంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు. ఇకనైనా జోనల్ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించి, సంబంధిత అవినీతి టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలకు సీఎంసీ కమిషనర్ కు సిఫార్సు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


సుభాష్ నగర్ మల్లన్న సిమెంట్ గోడౌన్ వెనుకాల... ఫాక్స్ సాగర్ నాలా బఫర్ జోన్ లో బహుళ అంతస్థుల నిర్మాణం

# వడియారం గ్రామంలో "డ్రై డే, ఫ్రై డే" కార్యక్రమం

**- సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన**



**చేగుంట ఆగస్టు 4**
చేగుంట మండలం వడియారం గ్రామంలో సర్పంచ్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో "డ్రై డే, ఫ్రై డే" కార్యక్రమం నిర్వహించడంజరిగింది.వర్షాకాలంలో దోమల వ్యాప్తి, డెంగ్యూ, మలేరియా వంటి అంటురోగాలు రాకుండా ఉండేందుకు ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. పాత టైర్లు, కుండలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సాయికుమార్ గౌడ్ గ్రామంలోని ఇంటింటికి వెళ్లి పరిశీలించి, పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు."డ్రై డే" పాటించి ఇళ్లలో, చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు గ్రామ కార్యదర్శి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వీధి దీపాలకు అల్లుకున్న చెట్లు - ప్రమాదం ముంచుకుంటోంది

**- పొలంపల్లి గ్రామ ప్రజల ఆందోళన**

**చేగుంట, ఆగస్టు 04** చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో కరెంటు వీధి దీపాల స్తంభాల చుట్టూ చెట్లు విచ్చలవిడిగా పెరగడంతో గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కరెంట్ తీగల మధ్యలో చెట్లు ఉండడంతో వర్షాకాలంలో ఈదురు గాలులు వచ్చినప్పుడు షార్ట్ సర్క్యూట్ లేదా కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులుభయ పడుతున్నారు. ఇప్ప టికైనా గ్రామంలో ఎక్కడైనా వీధి దీపాల కింద కరెంట్ తీగలకు అల్లుకున్న చెట్లను గుర్తించి తక్షణమే తొలగించే చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# మక్కారాజ్ పేట్ అంగన్వాడీలో తల్లిపాల వార్షికోత్సవం

**- గర్భిణీలు, బాలింతలకు అన్నప్రాసన - తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన**



**చేగుంట ఆగస్టు 4** చేగుంట మండలం మక్కారాజ్ పేట్ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టకరమని, పిల్లల ఎదుగుదలకు అత్యవసరమని అంగన్వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శ్యామల , టీచర్లు మంజుల, అఖిల, గ్రామ సర్పంచ్ రేఖ సురేష్ రెడ్డి గ్రామ సెక్రటరీ గణేష్ ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్యతో గొడవ - ఇంట్లో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**- ఇబ్రహీంపూర్ గ్రామంలో విషాదం**

**చేగుంట ఆగస్టు 4**
చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము మోహన్(37), తండ్రి రామయ్య, కులం ఎస్సీ మాదిగ, వృత్తి వ్యవసాయం గారు మద్యం మత్తులో తన భార్యతో గొడవప డ్డారు.క్షణికావేశంలో ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.ఈ ఘటనపై మృతుని భార్య కొమ్ము వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# వలసల అడ్డాగా మారిన ఉద్దానం"

**- "సుదీర్ఘకాలం పాలించిన పాలకుల నిర్లక్ష్యం వల్లే వెనుకబాటుతనం"**

**- "ఆఫ్ షోర్ ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉంది"**









**పలాస, ఆగస్టు 4:** ఉత్తరాంధ్ర అంటే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు. 3 కోట్ల రాష్ట్ర జనాభాలో దాదాపు 1 కోటి మంది ఉన్న ఈ ప్రాంతం నేడు వలసలకు, పేదరికానికి, నిరుద్యోగానికి పేరుగాంచింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతం కిడ్నీ వ్యాధులు, వలసలతో అత్యంత దారుణ పరిస్థితుల్లో ఉంది. ఒకప్పుడు వ్యవసాయం, మత్స్య సంపద, అడవి సంపదతో స్వయం సమృద్ధిగా ఉన్న ఈ ప్రాంతం ఈరోజు రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది. దీనికి కారణం ప్రకృతి కాదు. సుదీర్ఘకాలం పాలించిన పాలకుల నిర్లక్ష్యమే అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం ఈరోజు పుట్టింది కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచే ఈ ప్రాంతాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారు తప్ప అభివృద్ధి అజెండాలో పెట్టలేదు. విశాఖలో స్టీల్ ప్లాంట్, షిప్‌యార్డ్, పోర్టు వంటివి వచ్చినా అవి కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ తప్ప శ్రీకాకుళం, విజయనగరం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఫలితంగా ఈ రెండు జిల్లాలు ఈరోజు దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల జాబితాలో ఉన్నాయి. ఉద్దానం నుంచి యువత చదువు, ఉద్యోగం, కూలీ కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబైకి వలస వెళ్తున్నారు. రైతులు సాగునీరు లేక భూములు అమ్ముకుని కూలీలుగా మారుతున్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించిన జాతీయ స్థాయి కమిటీలు కూడా గతంలో అనేక సార్లు హెచ్చరించాయి. 2010లో కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ కమిషన్ ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని, పారిశ్రామికీకరణ జరగలేదని, ఉపాధి అవకాశాలు లేవని తేల్చింది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు, ప్రత్యేక నిధులు కేటాయించాలని సిఫార్సు చేసింది. అదేవిధంగా 2014లో కె.వి. శివరామకృష్ణ నిపుణుల కమిటీ కూడా ఒకే ప్రాంతంలో అధికారాలను కేంద్రీకరిస్తే ఉత్తరాంధ్ర, రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాలు మరింత వెనుకబడిపోతాయని హెచ్చరించింది. వికేంద్రీకరణయే పరిష్కారమని చెప్పినా, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను అమలు చేయలేదు.

ఉద్దానానికి జీవనాడి వంశధార, మహేంద్రతనయ జలాలు

ఉద్దానం వెనుకబాటుతనానికి శాశ్వత పరిష్కారం వంశధార జలాలు. వంశధార జలాలు ఇచ్ఛాపురం నియోజకవర్గం వరకు వెళ్తే సాగు, త్రాగునీరు సమస్యలు పరిష్కారం కావడమే కాక, వ్యవసాయ రంగంలో మూడు పంటలు వేసుకోవడానికి రైతాంగానికి వెసులుబాటు అవుతుంది.

అదేవిధంగా మహేంద్రతనయ నదీ జలాలు బంగాళాఖాతంలో వృధాగా పోనివ్వకుండా నాడు టెక్కలి శాసనసభ్యులు దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర కృషి మేరకు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్దానం ప్రాంత రైతాంగానికి సాగునీరుతోపాటు ప్రజలకు త్రాగునీరు సౌకర్యం కల్పించేందుకు ఆఫ్ షోర్ ప్రాజెక్టు శ్రీకారం చుట్టారు. అయితే తరువాత వచ్చిన ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ ప్రాజెక్టు పనులు చాలాకాలం నిలిచిపోయాయి. తరువాత స్థానిక రైతాంగం పోరాట ఉద్యమ ఫలితంగా మళ్లీ పనులు పునః ప్రారంభమైనప్పటికీ, ఈ ఏడాది కూడా సరైన నిధులు కేటాయించకపోవడంతో పనులు నత్తనడుగున సాగుతున్నాయి.

పలాస - కాశిబుగ్గ ప్రజల దాహార్తి

పలాస - కాశిబుగ్గ పురపాలక సంఘం ప్రజల శాశ్వత దాహార్తిని తీర్చేందుకు ఆఫ్ షోర్ ప్రాజెక్టును పూర్తి చేయవలసిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉంది. నిధుల కొరతతో ఉద్దానం ప్రజల కలలు మరోసారి అడియాశలవుతున్నాయి. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఉద్దానం ప్రజలకు త్రాగు, సాగునీరు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుకు అసలు కారణం సాగునీటి కొరతే. వంశధార, నాగావళి, గోస్తనీ వంటి జీవనదులు ప్రవహిస్తున్నా ఉద్దానం రైతులు వర్షాలపై ఆధారపడాల్సి వస్తోంది. వంశధార ప్రాజెక్టు దశాబ్దాలుగా నత్తనడకన సాగుతోంది. నాగావళి ప్రాజెక్టు పూర్తి కాలేదు. బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించలేదు. బదులుగా ఆ నిధులను కోస్తా, రాయలసీమలోని తమ ప్రాంతాల ప్రాజెక్టులకు మళ్లించుకున్నారు.రెండో పెద్ద సమస్య పారిశ్రామిక వెనుకబాటుతనం. విశాఖ తప్ప శ్రీకాకుళం, విజయనగరంలో ఒక్క పెద్ద పరిశ్రమ కూడా లేదు. మౌలిక వసతులు లేకపోవడంతో పెట్టుబడిదారులు ఈ ప్రాంతం వైపు రాలేదు. ఫలితంగా యువతకు ఉపాధి లేకుండా పోయింది. డిగ్రీలు, ఇంజనీరింగ్ చదివినా ఉద్యోగాలు లేక ఉద్దానం యువత బలవంతపు వలసలకు వెళ్లాల్సి వస్తోంది.

మూడోది గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల నిర్లక్ష్యం. ఉత్తరాంధ్రలో 30 శాతానికి పైగా గిరిజన జనాభా ఉంది. అరకు, పాడేరు, పార్వతీపురం వంటి ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధికి పూర్తిగా దూరంగా ఉన్నాయి. రోడ్లు లేవు, ఆసుపత్రులు లేవు, స్కూళ్లు లేవు, తాగునీరు లేదు.రాజ్యాంగపరంగా ఉత్తరాంధ్రకు ఉన్న హక్కులను కూడా కాలరాశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డి) ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాంతీయ బోర్డులను ఏర్పాటు చేయాలి. కానీ 70 ఏళ్లలో ఒక్కసారి కూడా దీనిని సరిగా అమలు చేయలేదు. రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం ఉత్తరాంధ్రకు 20 శాతం నిధులు రావాలి. కానీ వాస్తవంలో 8 నుంచి 10 శాతం కూడా రావడం లేదు.

ఈ నిర్లక్ష్యం ఫలితంగానే ఉద్దానం సహా ఉత్తరాంధ్ర ఈరోజు అన్ని రంగాల్లో వెనుకబడింది. ఇప్పుడు మళ్లీ ఉత్తరాంధ్ర ప్రజలు నిలదీస్తున్నారు. వికేంద్రీకరణ కావాలని, 371(డి) అమలు కావాలని, జనాభా దామాషా ప్రకారం నిధులు కావాలని అడుగుతున్నారు. వంశధార, మహేంద్రతనయ ఆఫ్ షోర్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తేనే ఉద్దానం బాగుపడుతుందని, లేదంటే మరో 70 ఏళ్లు ఇదే పరిస్థితి కొనసాగుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**వ్యాసకర్త: బల్ల గిరిబాబు**
**పలాస - కాశీబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్**

# అంపోలు జైలు నుంచి కాశీబుగ్గకు అప్పలరాజు తరలింపు

**- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వైసీపీ శ్రేణుల సంఘీభావం**

**- "ఇది రాజకీయ కక్ష" - వైసీపీ నేతల ఆగ్రహం**

**నవతరం.. పలాస..**
పలాస రాజకీయాల్లో మరోసారి కలకలం రేపిన రోడ్డు ప్రమాద కేసులో రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్ఆర్సీపీ సీనియర్ నేత డాక్టర్ సిదిరి అప్పలరాజును కాశీబుగ్గ పోలీసులు ఒక రోజు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కోర్టు అనుమతితో మంగళవారం ఉదయం అంపోలు జిల్లా జైలు నుంచి సింగుపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు అధికారులు తరలించారు.మాజీ మంత్రి కస్టడీ విచారణ వార్త తెలియగానే పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద వైఎస్ఆర్సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. తమ నాయకుడికి సంఘీభావం ప్రకటించేందుకు పోటీపడ్డారు. పోలీస్ వాహనంలో ఉన్న అప్పలరాజును ఒకసారి చూసేందుకు కార్యకర్తలు ఆత్రుతగా ముందుకు రావడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.ఇదే అంశంపై వైఎస్ఆర్సీపీ నేతలు మండిపడ్డారు. "బైక్ ప్రమాదం కేసును హత్యగా మార్చి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు" అని ఆరోపించారు. పలాస నుంచి కాశీబుగ్గ వరకు దారి పొడుగునా మండుటెండను లెక్కచేయకుండా మహిళలు, కార్యకర్తలు, అభిమానులు నిలిచి అప్పలరాజుకు మద్దతు తెలిపారు.

"వాస్తవాలు దాచిపెట్టారా? - పోలీసుల కీలక ప్రశ్నలు"

గత నెల 10న పలాస సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనలో అసలు వాస్తవాలను తారుమారు చేశారనే ఆరోపణలే ఈ కస్టడీకి కారణం. ప్రమాద సమయంలో అక్కడ ఎవరున్నారు, ఎవరు వాహనం నడిపారు, ఘటన తర్వాత జరిగిన



సంభాషణలు ఏమిటి అనే కోణాల్లో పోలీసులు ఆరా తీశారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ కాల్ డేటా ఆధారంగా అప్పలరాజును నిలదీశారు.

"ఏ-1, ఏ-2 బయటకు.. ఏ-3 ఇంకా లోపల"

ఈ కేసులో ఎ-1గా ఆరవ్ వర్మ, ఎ-2గా సిద్ధార్థ్ త్యాడి ఉండగా, వారిద్దరికీ ఇప్పటికే బెయిల్ మంజూరైంది. వారు జైలు నుంచి విడుదలయ్యారు. అయితే ఏ-3 నిందితుడిగా ఉన్న అప్పలరాజుకు మాత్రం గత నెల 23న 14 రోజుల రిమాండ్ విధి. ఆ గడువు ఈ నెల 5తో ముగియనుంది. ఈ నేపథ్యం లోనే బెయిల్ పిటిషన్‌కు ముందు పోలీసులు కస్టడీకి వెళ్లారు.

"రెడ్ బుక్ రాజ్యాంగం అమలు" - వైసీపీ ఆరోపణ

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వైఎస్ఆర్సీపీ సీనియర్ నేతలు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వైఎస్ఆర్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై, ప్రజా ప్రతినిధుల గొంతులను నొక్కేందుకు రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోంది. ఒక బైక్ ప్రమాదం కేసును హత్య నేరం కింద తారుమారు చేస్తూ, అక్రమంగా డాక్టర్ అప్పలరాజును అరెస్ట్ చేశారు. ఇది ముమ్మాటికి రాజకీయ కక్ష" అని వారు ధ్వజమెత్తారు. "కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా గాని, న్యాయస్థానంలో ు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది" అని వారు అన్నారు.

"తదుపరి ఏమిటి?"సాయంత్రం 5 గంటలకు విచారణ పూర్తయ్యాక అప్పలరాజును తిరిగి అంపోలు జిల్లా జైలుకు తరలించారు. కస్టడీలో సేకరించిన సమాచారం ఆధారంగా ఛార్జ్‌షీట్‌ను బలంగా రూపొందించే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 5న కోర్టులో జరగనుంది."సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు"సిస్టు గోపి, సుజాత పండా, బోర చంద్రకళ, పైల చిట్టిబాబు, దుర్గా శంకర్ పండ, అగ్గున సూర్యారావు, కర్రీ గోపాల్, బమ్మిడి ధర్మారావు, సేనాపతి కిషోర్, మడియ రామకృష్ణ, బత్తిన లక్ష్మణ్, తిరునగరి సవరయ్య మాస్టర్, అందాల శేషగిరి యాదవ్, బాడ జగన్నాయకులు, బమ్మిడి దివాకర్, పినకాన ముకుంద, బమ్మిడి సంతోష్, నాగేశ్వరం బృందావన్, కుర గౌడ్, తమరి శోభన్, గిన్ని తిరుపతిరెడ్డి, తిర్రి రాజారావు, కె. గోపి యాదవ్, బత్తిన హేమేశ్వర రావు, గున్న వెంకటరమణ, గున్న నారాయణ, దున్న హరికృష్ణ, కంచరాన చినబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యాప్తంగా మేఘావృతమైన ఆకాశం - హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన



**హైదరాబాద్ :** నైరుతి రుతుపవనాలు కదులికలు చురుగ్గా ఉన్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ఎల్లో అలర్ట్? కూడా జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో సోమవారం ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీ మీటర్లు, వికారాబాద్, సంగారెడ్డి వంటి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ప్రకటించారు. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం తేలికపాటిగా మొదలైన వర్షం రాత్రికి ఉద్ధృతంగా మారింది. గంటల తరబడి కురిసిన వానతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైడ్రా, మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో పంపింగ్ మోటార్లతో నీటిని తొలగించే పనులు కొనసాగించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్, మలక్‌పేట్, చంపాపేట్, చాదర్‌ఘాట్, అసెంబ్లీ, లక్డీ కా పూల్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, నిజాంపేట్, కుత్బుల్లాపూర్‌లో కురిసిన వర్షానికి నీరు రోడ్లపైకి చేరడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఈ వర్షంతో నగర జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు వాతావరణ శాఖ మరో 24 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నగరంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీళ్లు చేరాయి. ఉదయం ప్రజ జీవనానికి ఏ విధంగా ఇబ్బంది ఉండకూడదని హైడ్రా అర్ధరాత్రి 12 గంటల సమయంలోనూ సేవలందించింది. నగరవ్యాప్తంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో హైడ్రా ఐ=ఖీ, వీ=ు బృందాలు సేవలు అందించాయి. రహదారుల్లో నిలిచిన వరద నీటిని సాఫీగా డ్రైనేజీల్లోకి పంపేసింది. వర్షం ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని.., క్షేత్ర స్థాయిలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి హైడ్రా అధికారుల సూచనలు చేస్తూ సిబ్బందితో పని చేయించారు. అవసరమైన చోట వెనువెంటనే సహాయక చర్యలతో పరిస్థితులు చేయిదాటిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నారు



**న్యూఢిల్లీ:** ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించా రు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై పెట్టాలని

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరప్రతాలు ఆవిష్కరణ



**దమ్మపేట, ఆగస్టు 04 :** ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగురవేయాలన్నారు. జాతి ఐక్యతను చాటాలని, తమ జాతి హక్కులను, చట్టాలను రక్షించడానికి బలమైన ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకుడు కాకా రమేశ్ పాల్గొన్నారు.

# ఫ్యాబ్రిక్ డై, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ




**హైదరాబాద్, ఆగస్టు 4 :** హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశామని భాగ్యనగర సీపీ సజ్జనార్ (పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఆ మసాలాల్లో హానికర రసాయనాలు..ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రీయల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. ఈ మసాలాలతో కేన్సర్..కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో కేన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదమని తెలిపారు. ఎ- ఖీూూ ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఇక హద్దులు పక్కాగా..గట్టు పంచాయతీలకు తెర




**జమ్మికుంట(కరీంనగర్):** నిజాం కాలంలో చేసిన సర్వేను ప్రమాణికంగా తీసు కుని ఇప్పటి వరకు భూముల సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. సాధారణంగా ప్రతి 30ఏళ్లకు ఒకసారి భూ సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు దానిని నిర్లక్ష్యం చేశాయి. దీంతో ప్రభుత్వ భూములు సైతం కబ్జా కావడంతోపాటు సరిహద్దు వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి రీసర్వే ప్రక్రియను అత్యాధునికమైన డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) విధానం ద్వారా నిర్వహిస్తోంది. ఈ సర్వేకు భూ భారతి పోర్టల్ ద్వారా జీపీఎస్ వెరిఫైడ్ ల్యాండ్ మ్యాపింగ్ సాంకే తికతను ఉపయోగిస్తున్నారు. ఉపగ్రహ ఆధారిత అక్షాంశాలు, రేఖాంశాలు ద్వారా భూమి సరిహద్దులను డిజిటల్‌గా లాక్ చేస్తారు. దీనివల్ల ఒకరి భూమిని మరొకరు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు. గ్రామాల్లో ప్రధాన సమస్యలైన గెట్లు జరపడం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించుకోవడం, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, సంక్షేమ పథకాలను దొడ్డిదారిన పొందుతున్నటువంటి వారికి ఈ భూ భారతి చట్టం ద్వారా చెక్ పడనుంది. సాగు భూ ముల రిజిస్ట్రేషన్లలో సరిహద్దు మ్యాప్‌లను అను సంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిబంధన లను అమల్లోకి తెచ్చింది. ప్రతి పట్టాదారుకు భూధార్ అనే పేరుతో ఒక నంబర్‌ను కేటాయి ంచి, వారికి సంబంధించిన పూర్తి భూమి వివరాలు అందు లో పొందుప రుచుతారు. క్యూ ఆర్ కోడ్‌ను కేటాయించి, ఎల్‌పీఎమ్ విధానం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) ద్వారా రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను క్రోడీకరించ నున్నారు. రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి సరిహ ద్దులు ఒకేలా ఉండేలా చూసి వివాద రహిత భూ మిగా గుర్తిసారు. రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి ఒక ప్రత్యేక భూధార్ నంబర్‌ను కేటాయిస్తున్నారు. మనిషికి ఆధార్ కార్డు ఎలాగో, భూమికి ఈ భూధార్ కార్డు అలా పనిచేస్తుంది. ఇందులో భూమి విస్తీర్ణం, సరిహద్దుల మ్యాప్ డిజిటల్‌గా లింక్ అయి ఉంటాయి. ప్రతీ మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకున్న ప్రభుత్వం.. ఆయా గ్రామాల్లో భూభారతి ద్వారా భూముల సర్వేను చేస్తోంది. జిల్లాలోని జమ్మికుంట మండలంలో విలాసాగర్ గ్రామం ప్రభుత్వం ఎంచుకున్న పైలట్ ప్రాజెక్ట్‌లో ఒకటి. విలాసాగర్‌లో మొత్తం 386 సర్వే నెంబర్లు ఉండగా, అందులో 1,423 ఎకరాల 24 గుంటల భూమి ఉంది. 15 సర్వే నంబర్లలో 139 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 371 సర్వే నంబర్లలో 492 మంది రైతులకు సంబంధించిన 951 ఎకరాల భూమి ఉంది. మిగిలిన 333 ఎకరాల భూమి మానేరు వాగులో భాగంగా అధికారులు తేల్చారు.

# నీ సూసైడ్ నోట్ ఆధారంగానే కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం



**హైదరాబాద్ :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి వేణు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిసి ందే. ఈ మేరకు వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా పరా మర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసిన వేణుని ఆసుపత్రిలో పరామర్శించి కేటీఆర్ చేత ఫోన్ మాట్లాడించగా. వేణుకు ధైర్యం చెప్పిన కేటీఆ ర్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదని, నోటిఫికేషన్ల కోసమే ఆత్మహత్యాయత్నం చేసుకుంటే.. తాను వ్యక్తిగత ప్రేమ వ్యవహారంతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం తనపై దుష్ప్రచారం చేస్తోందని వేణు కేటీఆర్‌తో ఆవేదన పంచుకున్నాడు. మా అమ్మ మానసిక వికలాంగురాలు. తనకు సొంత ఇల్లు లేనప్పటికీ కక్షపూరితంగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదన్నాడు. మా వేణు రాసింది సూసైడ్ నోట్ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఛార్జ్ షీట్ అని ప్రెస్ మీట్ పెట్టి గట్టిగా మాట్లాడటం జరిగింది. దాని ఆధారంగానే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తామని, రాగానే దాని ఆధారంగానే న్యాయం చేస్తామని కేటీఆర్ వేణుకు భరోసానిచ్చారు.

# ‘ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి వ్యవసాయ రంగం



**కోదాడ, ఆగస్టు 04 :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఎన్నికల్లో రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారు స్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను దగా చేస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలం టూ ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన క్రాప్ లోన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. గతంలో ప్రతి ఏడాది రైతులు పంట రుణాలను సులభంగా రెన్యువల్ చేసుకునేవారని ప్రస్తుతం బ్యాంకులో పాత రుణ మొత్తం అసలు, వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని రైతులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. బ్యాంకులపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోలేదని, లో వోల్టేజీతో , ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకిచ్చే ప్రైవేట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్) రాయితీని ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమన్నా రు. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీలర్లు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని ఈ భారం రైతుల పైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

# చేనేత మగ్గంతో అద్భుతం - 170 నిమిషాల్లోనే అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా :** రంగురంగుల దారాలను మగ్గంపై పేర్చి, తమ ఊపిరిని నూలు పోగులుగా మలచి, అద్భుతమైన వస్త్రాలను సృష్టించే వారే చేనేత కార్మికులు. చేనేత అంటే కేవలం ఒక వృత్తి కాదు. తెలం గాణ సంస్కృతి, వారసత్వానికి, కళా వైభవానికి సజీవ రూపం. అలాంటి గొప్ప కళ గురించి ఇప్పుడు విస్తృతంగా మాట్లాడుకునే విధంగా చేశాడు ఈ నేతన్న. అంతే కాకుండా చేనేత వృత్తి గురించి నిరంతరం ప్రపంచానికి చాటి చేప్పే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎంత కళా నైపుణ్యమున్న చేనేత కార్మికుడైనా పట్టు చీరను నేయాలంటే కనీసంగా ఒక్కరోజు పడుతుంది. అలాంటిది కేవలం 170 నిమిషా ల్లో చీరను నేసి అగ్గిపెట్టెలో పట్టే విధంగా రికార్డు నెలకొల్పారు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్. ఆగస్టు 7న అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల నేతన్నల కళా నైపుణ్యం, వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ సాహసం చేశారు. అను కున్న సమయం కన్నా ముందుగానే చీరను నేసి, అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు హరిప్రసాద్. చేనేత చరిత్రలో మైలురాయి : ఆగస్టు 3న ఉదయం 9:30 గంటలకు పట్టుచీర నేతను హరిప్రసాద్ తన యంత్రంలో పెట్టి ప్రారంభించాడు. 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు, 175 గ్రాముల బరువున్న చీరను 170 నిమిషాల్లో అంటే సరిగ్గా 12:20కి వేగంగా పూర్తి చేశాడు. ప్రత్యేక నైపుణ్యంతో ఆ చీరను మడిచి, ప్రముఖుల సమక్షంలో సాధారణ అగ్గిపెట్టెలో పెట్టి తన ప్రతిభను ప్రదర్శించారు. ఈ చీర తయారీలో సుమారు 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్పు పోగులు ఏమాత్రం తీసిపోకుండా సంప్రదాయ చేనేత మగ్గంపైనే ఈ అరుదైన ఘనత సాధించడం చేనేత చరిత్రలో చర్చనీయాంశంగా మారింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్?లో నమోదు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రికార్డును సాధించడం కోసం హరిప్రసాద్ ఏడాది కాలంగా రోజుకు 3 నుంచి 4 గంటల పాటు సాధన చేసినట్లు తెలిపారు. ”నేను ఒక సంవత్సర కాలంగా కష్టపడ్డాను. రోజుకు 3 గంటల చొప్పున నేసి చీరల తయారీ చేసేవాడిని. మరమగ్గంతో పోటీ పడాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం సంతోషం గా ఉంది. ఈ చీర 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్పు పోగులతో 175 గ్రాముల బరువు ఉంటుంది. గతంలో +-20 లోగో నేసి ప్రధాని మోదీ గారికి పంపాం. 95వ మన్ కీ బాత్ కార్యక్రమంలో నా గురించి, మా సిరిసిల్ల పట్టణం గురించి మోదీ ప్రత్యేకంగా మాట్లాడా రు.” - వెల్ది హరిప్రసాద్, చీరను నేసిన కార్మికు డుఒక చీరను ఎంత నైపుణ్యం ఉన్న నేత కార్మికుడు నేసినా కనీసం ఒక రోజు పడుతుంది. మర మగ్గం (ఆధునిక యంత్రం) మీద నేసినా అంతకన్నా ఎక్కువ సమయమే పడుతుంది. అలాంటిది మరమగ్గంతో పోటీ పడి, ఈ ఘనతను సాధించానని చెబుతున్నాడు హరి ప్రసాద్. శరీరంలోని అన్ని అవయవాలను ఏకీకృతం చేస్తే తప్ప ఇంత తక్కువ సమయంలో చీర నేయడం సాధ్యం కాదని చెబుతున్నాడు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com